సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం । 9 । జూలై । 2025



ఆస్పత్రులకు కొత్త అధిపతులు

వైద్య కళాశాలలు, జనరల్ ఆస్పత్రులకు కొత్త అధిపతులను నియమించారు.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల జలాశయానికి వరద కాస్త పెరిగింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /22.2

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: యాసంగి 2024–25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం గడువులోగా అందజేయాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం రవాణా చేయాలన్నారు. దీనిని మిల్లర్లందరూ ప్రాధాన్యతగా పరిగణించి నిబంధనల మేరకు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలన్నారు. ఇప్పటి వరకు కేవలం 19 శాతం మాత్రమే బియ్యం తిరిగివ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సీఎంఆర్ పురోగతిని తప్పక పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డీఎం రవినాయక్ పాల్గొన్నారు.

12న ఫుడ్ ఫెస్టివల్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈనెల 12న పెద్ద ఎత్తున ‘ఫుడ్ ఫెస్టివల్’ నిర్వహించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మెప్మా భవనంలో ఆర్పీలు, ఎస్‌హెచ్‌సీ–ఓబీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం స్థానిక శిల్పారామంలోని 42 స్టాళ్లలో వివిధ ఆహార పదార్థాల తినుబండారాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం నగర పరిధిలోని ఎస్‌హెచ్‌జీలతో మాట్లాడి వీలైనంత ఎక్కువ మంది ఈ ప్రదర్శనలో పాల్గొనేలా చూడాలన్నారు. రెండో శనివారం కావడంతో నగర ప్రజలు భారీగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు రావచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, సీఓలు పాల్గొన్నారు.

హజ్‌యాత్రకు దరఖాస్తుల స్వీకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పవిత్ర హజ్ యాత్రకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.మహమూద్‌అలీ, మేరాజుద్దీన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్‌లోని జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్‌యాత్ర దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైనట్లు తెలిపారు. ఈనెల 31 తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హజ్‌యాత్రకు సంబంధించి దరఖాస్తులను అందజేయాలని కోరారు. సొసైటీ తరఫున దరఖాస్తుదారుల ఆన్‌లైన్ సేవలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రవూఫ్‌పాష, సత్తార్, మహ్మద్ రఫీక్, ఖాజా నిజాముద్దీన్, మహ్మద్ ఫైజొద్దీన్, సయ్యద్ నిజాముద్దీన్, అహ్మద్ పటేల్, ఎండి. మూసా, రఫీక్ ఉర్ రహెమాన్, ఎండీ అర్షద్‌అలీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్‌లో బుధవారం నుంచి నెల 12తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు మంగళవారం తరలివెళ్లింది. ఈసందర్భంగా జిల్లా జట్టును స్థానిక మెయిన్ స్టేడియంలో ఆయన అభినందించారు. ఫుట్‌బాల్‌లో జిల్లాలో క్రీడాకారులకు కొదువలేదన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిరంతర ప్రాక్టీస్‌తో క్రీడల్లో ఉన్నతస్థానాల్లో చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శంకర్ లింగం, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి కేఎస్.నాగేశ్వర్, సభ్యులు నందకిషోర్, కోచ్ వెంకట్రాములు, ప్రకాశ్, లక్ష్మణ్, భార్గవి, పూజ పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు: ముడావత్ నిఖిత, ఎంవీ దయాంజలి, పి.ఆనంద వర్షిణి, వినుతశ్రీ, తిరుమల రుత్విక, డి.సునీత, పాత్లవత్ ఆర్తి, ఎ.వర్ష, ఎల్.అనూష, సి.మణిదీపిక, కె.నిహారిక, ఆర్.సావిత్రి, ఎం.కీర్తి, ఆర్.పూజ, స్వాతి, కె.నిత్య, శాన్విత, నర్వ రిశితారాజ్.

నగర సమస్యలను పరిష్కరిస్తాం

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- ‘సాక్షి’ ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన
- రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలన్న ప్రజలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ‘సాక్షి’ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో నిర్వహించిన ‘ఫోన్ ఇన్’ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల పరిధిలో తిష్ట వేసిన సమస్యలను స్థానికులు ప్రస్తావించగా వీలైనంత వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, కుక్కల బెడదను నివారించాలని, పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి..

సాక్షి ఫోన్ ఇన్

■ **ప్రశ్న:** మా ప్రాంతంలో రోడ్డు సరిగా లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
– నాసర్ (సద్దలగుండు), మజార్ (ప్రేమ్‌నగర్), మహమ్మద్ నజీముద్దీన్, హనుమాన్‌పురా

■ **కమిషనర్:** ఆయా ప్రాంతాలకు మా సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం.

■ **ప్రశ్న:** కోస్గి రోడ్డుపై ఎక్కడికక్కడే గుంతలు పడ్డాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి పాదచారులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– వెంకట్‌రెడ్డి, మర్లు, మహబూబ్‌నగర్

■ **కమిషనర్:** త్వరలోనే ఈ రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం.

■ **ప్రశ్న:** కోయనగర్‌కు వెళ్లే దారిలో రైల్వే బ్రిడ్జి వద్ద పెద్ద కాల్వ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగలకు ఆవాసంగా మారింది.
– డి.బాలస్వామి, దొడ్డలోనిపల్లి, మహబూబ్‌నగర్

■ **కమిషనర్:** అక్కడికి వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం.

■ **ప్రశ్న:** ఆంజనేయస్వామి గుడి నుంచి మైసమ్మ దేవాలయం వరకు యూజీడీ కోసం సిమెంట్ పైపులు వేసి మధ్యలో అక్కడక్కడ ఆపేశారు. ఈ పనులు రెండు నెలలుగా నెమ్మదిగా సాగుతున్నాయి. వెంటనే పూర్తి చేయించాలి.
– రాంచంద్రయ్య, శీర్షిక, పాత పాలమూరు వాసులు

■ **కమిషనర్:** ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

■ **ప్రశ్న:** గచ్చిబౌలిలోని రెండు మూడు గల్లీలలో రోడ్లు తవ్వి వదిలేశారు. దీంతో లోపలి వరకు చెత్తబండి, ఆటోలు, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు.
– ఎండీ జమీల్, గోల్ మసీదు ప్రాంతం

■ **కమిషనర్:** మీ ప్రాంతంలో త్వరలోనే సీసీ రోడ్లు నిర్మించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తాం.

■ **ప్రశ్న:** న్యూటౌన్ చౌరస్తా నుంచి రాజేంద్రనగర్ వరకు ఒకవైపు రోడ్డును తవ్వి వదిలేశారు. 167 ఎన్‌హెచ్‌పై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చౌరస్తా వద్ద ట్రాఫిక్ జాం అవుతోంది.
– సంపత్‌కుమార్, రాజేశ్, జహంగీర్‌బాబా, రాజేంద్రనగర్ వాసులు

■ **కమిషనర్:** కాంట్రాక్టర్‌ను పిలిపించి సీసీ రోడ్డును త్వరలో వేయిస్తాం. ట్రాఫిక్ సీఐతో మాట్లాడి వెంటనే అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తాం. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ విషయమై పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

■ **ప్రశ్న:** విలీన గ్రామమైన పాలకొండలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మోరీలను శుభ్రం చేయడం లేదు.
– వెంకటయ్యగౌడ్, పాలకొండ

■ **కమిషనర్:** మీ ప్రాంతంలో రోడ్లు బాగు చేయిస్తాం. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం

■ **ప్రశ్న:** కమ్యూనిటీ హాలు పక్క నుంచి యూడీజీ నిర్మించాలి.
– కేశమోని శారద, పాత పాలమూరు

■ **కమిషనర్:** ఇంజినీరింగ్ అధికారులను పంపి పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

■ **ప్రశ్న:** అయ్యప్పగుడికి వెళ్లే దారిలో, భాగ్యనగర్‌లోని కింది ప్రాంతం సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందుల పాలవుతున్నాం. దోమలు, ఈగలకు ఆవాసంగా మారింది. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు.
– పగడం మల్లేష్ (పద్మావతికాలనీ), శ్రీకాంత్ (భాగ్యనగర్)

■ **కమిషనర్:** క్షేత్రస్థాయిలో ఒకసారి పరిశీలించి ఈ సమస్యలు పరిష్కరిస్తాం.

■ **ప్రశ్న:** రూరల్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలోని వీధికి చెత్తబండి సరిగా రావడం లేదు. కోర్టు రోడ్డులోని ఓపెన్ ప్లాట్లలో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.
– ఎ.రాజసింహుడు, నాగభూషణం (శ్రీనివాసకాలనీ), మోహన్‌దాస్, సుభాష్‌నగర్

■ **కమిషనర్:** ఆయా చోట్లకు పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటాం.

■ **ప్రశ్న:** ఎర్రకుంట సమీపంలోనే మా కాలనీ ఉంది. స్లమ్ ఏరియా అయినప్పటికీ చెత్తబండి సరిగా రావడం లేదు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దోమలు బెడదతో సతమతమవుతున్నాం.
– విశ్వనాథ్, కురిహినిశెట్టికాలనీ

■ **కమిషనర్:** మీ ప్రాంతానికి క్రమం తప్పకుండా స్వచ్ఛ ఆటోను పంపిస్తాం.

అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం



శ్రీనివాసకాలనీలోని పార్కును పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానికహౌసింగ్ కాలనీ, శ్రీనివాస కాలనీలను మంగళవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 60డివిజన్లలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులకు త్వరలో నిధులు రానున్నాయన్నారు. వీటికి సంబంధించి ఈపాటికే ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆస్తిపన్ను, నల్లా బిల్లులలో ఎలాంటి బకాయిలు లేకుండా చెల్లించాలని ప్రజలకు సూచించారు. హౌసింగ్ బోర్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. శ్రీనివాసకాలనీలోని చిక్కుడు వాగు పెద్దకాల్వను పటిష్టం చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పీయూలో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఫస్ట్, సెకండియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. ఇందుకోసం నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని, ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విభాగం విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రధాన భూమిక పోషిస్తుందని, వాటిలో వచ్చే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఓడీ శివకుమార్‌సింగ్, శ్రీనివాసులు, కోమలి, రాణెమ్మ, బృందాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు

- కేఎల్ఐ కాల్వలకు నీటి విడుదల
- 4.20 లక్షల ఎకరాలకు నీరందించాలని లక్ష్యం



ఎల్లూరు లిఫ్ట్ నుంచి విడుదల అవుతున్న నీరు

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభమైంది. మంగళవారం కొల్లాపూర్ మండలం ఎల్లూరు పంప్‌హౌజ్ వద్ద రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కేఎల్ఐ కాల్వలకు నీటి సరఫరాను ఆరంభించారు. ఈసారి కృష్ణా నదిలో ముందస్తు వరద ప్రవాహంతో శ్రీశైలం రిజర్వాయర్ నిండి.. బ్యాక్‌వాటర్ నీటిమట్టం పెరిగింది. పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండటంతో ఆయకట్టు రైతులు పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. బోరుబావుల కింద సాగుచేస్తున్న రైతులు ఇప్పటికే వరినార్లు, విత్తనాలు వేసుకోగా.. కాల్వల కింద సాగుచేస్తున్న రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఆయకట్టుకు నీటి విడుదల చేయడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు.

■ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో మొత్తం 4.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటివరకు చేపట్టిన పనులు, రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణం మేరకు 2.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు మించి నీరందించలేని పరిస్థితి. పూర్తిస్థాయిలో నీటిసరఫరా చేపట్టాలంటే.. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే కేఎల్ఐ పనులు పూర్తిచేయడంలో ఏళ్లుగా జాప్యం కొనసాగుతుండటంతో ఈసారి సైతం పరిమితంగానే ఆయకట్టు రైతులకు నీరు అందుతుంది. ప్రధానంగా కేఎల్ఐ విస్తరణ పనుల్లో భాగమైన 28, 29, 30 ప్యాకేజీల్లో పెండింగ్ పనులు పూర్తికాలేదు. వెల్దండ, ఉప్పునుంతల మండలాల్లో చివరి వరకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిర్వహణ చేపడితేనే ప్రయోజనం..

కేఎల్ఐ కింద మూడు లిఫ్టుల్లో మోటార్ల ద్వారా నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు. మొదటి లిఫ్టు ద్వారా ఎల్లూరు జలాశయంతో పాటు సింగోటం రిజర్వాయర్, రెండో లిఫ్టు ద్వారా జొన్నలబొగుడ రిజర్వాయర్, మూడో లిఫ్టుతో గుడిపల్లి రిజర్వాయర్‌ను నింపాల్సి ఉంటుంది. వీటికి అనుసంధానంగా ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ప్రస్తుతం చెరువులను మాత్రమే నింపేందుకే అధికారులు పరిమితమవుతున్నారు. ఒక్కో రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం ఒక టీఎంసీలోపే కావడంతో ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేదు.

నిర్వహణలో నిర్లక్ష్యం..

ప్రాజెక్టు కింద చేపట్టిన మూడు లిఫ్టుల్లోనూ ఐదేసి మోటార్లతో నీటి ఎత్తిపోతలను చేపట్టాల్సి ఉండగా.. ప్రతిసారి 2 మోటార్లకు మించి పని చేయడం లేదు. మిగతా మోటార్ల మరమ్మతు కోసం ఏళ్ల సమయం పడుతోంది. కృష్ణానదిలోని నీటిని తీసుకునే ఇన్‌టెక్ వద్ద సర్జ్‌పూల్ నుంచి పంప్‌హౌస్‌లోకి నీరు చేరకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇక్కడి గేట్లకు మరమ్మతు, నిర్వహణ లేక తుప్పుపట్టి బలహీనంగా మారుతున్నాయి.

సాగునీటికి ఇబ్బంది లేకుండా..

కేఎల్ఐ కింద ఆయకట్టుకు నీటి సరఫరా ప్రారంభమైంది. రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు ఎత్తిపోతల ద్వారా నీటితో నింపేలా చర్యలు తీసుకుంటాం. ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం. మోటార్ల మరమ్మతు, నిర్వహణ పనులు చేపడుతున్నాం.
– విజయభాస్కర్‌రెడ్డి, సీఈ, నీటిపారుదల శాఖ

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జడ్చర్ల: మహిళా సంఘాలు స్వయం సమృద్ధిని సాధించే దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జడ్చర్ల ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిలో మహిళా సంఘాల అధ్యక్షులు క్రమశిక్షణతో సంఘాలను బలోపేతం చేస్తూనే ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పని చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూనే మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి నెలా సక్రమంగా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు కొత్త నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని, ప్రభుత్వం ఆ దిశగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఏ పని చేసినా మహిళలు విజయవంతం చేస్తారనే భావన ఉందని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను ఎంపిక చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాల ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చారని గుర్తు చేశారు. జడ్చర్ల మహిళా సమాఖ్య ద్వారా కూడా ఒక ఆర్టీసీ బస్సును కొనుగోలు చేసేందుకు రూ.6 లక్షలు వెచ్చించారని పేర్కొన్నారు. సోలార్ యూనిట్లు, క్యాంటీన్‌లు, చిరు దాన్యాల ఉత్పత్తుల తయారీ తదితర యూనిట్లపై దృష్టి సారించి ఆదాయాన్ని సాధించే దిశగా ఆలోచించాలన్నారు. మహిళలు ముందుకు వచ్చి స్వయం ఉపాధి, తదితర యూనిట్లపై దృష్టి సారిస్తే వాటి ఏర్పాటుకు పోలేపల్లి సెజ్‌లో స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వారికి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డీటీలు కిషోర్, మహబూబ్ అలీ, ఏపీఓ మాల్యానాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ మంజులాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టు పాలమూరు

- ధూల్‌పేట నుంచి యథేచ్ఛగా గంజాయి సరఫరా
- కట్టడి చేయడంలో పోలీస్, ఎక్సైజ్ అధికారుల విఫలం
- మత్తులో నేరాలకు పాల్పడుతున్న యువత
- ఇటీవల పాలమూరులో పెరిగిన కత్తులతో దాడులు
- బాధితుల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు వారే అధికం



మహబూబ్‌నగర్ క్రైం: ‘గంజాయి విక్రయదారులు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు.. చాక్లెట్లు, సిగరెట్, ఆయిల్ రూపంలో ఇలా భిన్నంగా ఆలోచిస్తూ మత్తును చేరవేస్తున్నారు. ఒక్కసారి ఆ మత్తుకు అలవాటుపడిన యువత బయటకు రావడం చాలా కష్టంగా మారుతోంది. చివరికి దాడులు చేసుకోవడం, ఇతర నేరాలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడుతూ.. తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. బాధితుల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు వారే అధికంగా ఉండటం విచారకరం.

గ్రాముల చొప్పున విక్రయం..

ప్రధానంగా పాలమూరుకు సరఫరా అవుతున్న ఎండు గంజాయిలో అధిక శాతం ఒడిశా నుంచి వస్తుంటే.. మరికొంత హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ నుంచి వస్తోంది. దీనిని ఒక కేజీ గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి.. దాంట్లో నుంచి ఐదు నుంచి ఆరు గ్రాములను ఒక పాకెట్‌గా ఏర్పాటు చేసి రూ.500 నుంచి రూ.700లకు విక్రయిస్తున్నారు. పోలేపల్లి సెజ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పని చేసే ఒడిశాకు చెందిన కూలీలు కొంత రవాణా చేస్తుంటే దీని సరఫరాను అడ్డుకోవడానికి పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాలలు, కాలనీల్లో విద్యార్థులు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

బానిస కావాల్సిందే..

ఎవరైనా మత్తు పదార్థాలకు ఒక్కసారి అలవాటు పడితే వాటి నుంచి దూరం కావడం అసాధ్యం. ఆ మత్తుకు అలా బానిస కావాల్సిందే. కేవలం మత్తును ఆస్వాదించడం కోసమే వినియోగించే డ్రగ్స్‌ను ఆస్పత్రుల్లో శస్త్రచికిత్స చేసే సమయంలో రోగులకు నొప్పి తగ్గడానికి వైద్యులు అవసరమైన మోతాదులో రోగులకు ఇస్తుంటారు. ఇలాంటి డ్రగ్స్‌ను అవసరమైన దానికంటే ఎక్కువగా ఉపయోగిస్తే మనిషిపై తీవ్ర ప్రభావం చూపించడంతోపాటు నిత్యం కావాలనిపిస్తుంది. ఇలాంటి మత్తును రుచి చూసిన వారు జీవితాంతం కావాలని కోరుకుంటారు. ఇలాంటి మత్తు ఇంజెక్షన్ల వల్ల పూర్తిగా నరాల వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుంది. అలాగే మత్తు అత్యవసరమైన సమయంలో అందుబాటులో లేకపోతే విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే అవకాశం లేకపోలేదు.

దాబాల్లోనూ విక్రయాలు..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదు కాగా 975 గ్రాముల ఎండు గంజాయి, 8 మంది అరెస్టు చేయడంతో పాటు మూడు వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. అలాగే జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదు కాగా పది మంది అరెస్టు చేయగా రెండు కేజీల 650 గంజాయి, 8 సెల్‌ఫోన్లు, ఒక వాహనం సీజ్ చేశారు. జడ్చర్ల పరిధిలో జాతీయ రహదారి వెంట ఉన్న దాబాల్లో గంజాయి విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఇటీవల షాద్‌నగర్– బాలానగర్ మధ్యలో ఉన్న దాబాల్లో గంజాయి దొరకడమే ఇందుకు నిదర్శనం. రాజాపూర్ నుంచి టోల్‌గేట్ మధ్యలో ఉన్న కొన్ని హోటళ్లు, దాబాల్లో బయటి వ్యక్తులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.



ఇటీవల ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

కేసులు నమోదు..



జిల్లాలో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టాం. కొన్ని ప్రత్యేక కాలనీల్లో యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం రాగానే తనిఖీలు చేస్తున్నాం. జాతీయ రహదారితో పాటు దాబాల్లో కూడా ప్రత్యేక బృందాలు నిత్యం తనిఖీలు జరుపుతున్నాయి. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.
– సుధాకర్, జిల్లా ఎక్సైజ్ అధికారి

సకల కార్మికులంతా నేటి సమ్మెలో పాల్గొనాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులంతా బుధవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెకు సంబంధించిన ఆటో జాతాను మంగళవారం ప్రారంభించారు. టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, టీఎన్‌టీయూసీ జిల్లా నాయకులు డి.రాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వాలు హక్కులను హరించేందుకు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్మికుల వాయిస్‌ను ప్రభుత్వాలకు వినపడేలా గర్జించాలని సూచించారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

వెల్దండ: ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల మేరకు కొనేరు అశ్విని (23) అనే వివాహిత ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. అయితే భర్త వెంకటేష్, కుటుంబ సభ్యులు వేధించడంతోనే తమ కుమార్తె మృతి చెందినట్లు మృతురాలి తండ్రి దశరథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్: మండలంలోని కుచ్చర్‌కల్, రాజాపూర్ గ్రామాల మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. వివరాల్లోకి వెళ్తే నవాపేట్ మండలం చౌటపల్లికి చెందిన రాజాపురం బుచ్చయ్య(60) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుచ్చయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివానందంగౌడ్ అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి..?

- రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

గద్వాల క్రైం: గద్వాల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఓ ప్రభుత్వ ఉద్యోగి దాడికి పాల్పడినట్లు తహసీల్దార్ మల్లికార్జున్, ఆర్ఐ రామక్రిష్ణ మంగళవారం తెలిపారు. గద్వాల మండలంలోని పరుమాల గ్రామ శివారులో ఓ ప్రభుత్వ ఉద్యోగితోపాటు మరో ముగ్గురు రైతులకు భూ వివాదం ఉంది. దీంతో హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు పలు సూచనలు చేస్తూ రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, మంగళవారం ఉదయం సదరు ప్రభుత్వ ఉద్యోగి కోర్టు ఉత్తర్వును పరిగణలోకి తీసుకోకుండా భూమిని చదును చేస్తుండగా.. గమనించిన రైతులు విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్ఐ రామక్రిష్ణ సంఘటన స్థలానికి చేరుకోగా ప్రభుత్వ ఉద్యోగి అకారణంగా అతనిపై దుర్భాషలాడి దాడి చేసే విధంగా భయభ్రాంతులకు గురిచేశాడు. సదరు ప్రభుత్వ ఉద్యోగిపై తహసీల్దార్ గద్వాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలాఉండగా, ఈ విషయమై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పెంపుడు కుక్క పెట్టిన గొడవ..

- ఇరు కుటుంబాల పరస్పర దాడులు.. కేసు నమోదు

మహమ్మదాబాద్: ఓ పెంపుడు కుక్క.. మరో ఇంటి ఆవరణను అపరిశుభ్రం చేసిన నేపథ్యంలో నెలకొన్న గొడవ కాస్తా.. ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు పరస్పర దాడులకు దిగడంతోపాటు చివరికి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యేంత వరకు వచ్చింది. ఈ ఘటన గండీడ్ మండలంలోని పగిడ్యాల్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గ్రామంలోని కిష్టప్పకు చెందిన పెంపుడు కుక్క ఆ ఇంటిపక్కనే ఉన్న మంగమ్మ ఇంటి ఆవరణలోకి వచ్చి అపరిశుభ్రం చేస్తుండగా ఆమె గమనించింది. వెంటనే ఆ కుక్కను కొట్టి అక్కడి నుంచి తరిమివేయడంతోపాటు ఆ ఇంటి యజమానిని దుర్భాషలాడింది. దీంతో కిష్టప్ప, మంగమ్మ మధ్య మాటామాట పెరగడంతో అక్కడే ఉన్న మంగమ్మ భర్త కాశప్ప కిష్టప్పపై దాడికి దిగాడు. దీంతో కిష్టప్పకు చెందిన పలువురు వ్యక్తులు కాశప్పపై గడ్డపారతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు కాశప్ప భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కిష్టప్పపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.


స్థానిక ఎన్నికలు అప్పుడే నిర్వహించాలి



జడ్చర్ల టౌన్: బీసీ రిజర్వేషన్ ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే జీఓకు చట్టబద్ధత ఉంటుందా? అని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలో మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పెంచడానికి ప్రస్తుతం ఉన్న జీఓను సవరణ చేసి నూతన జీఓ అమలుకు న్యాయ నిపుణులు సలహా ఇచ్చారని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈనెల 10న జరిగే కేబినెట్ సమావేశంలో జీఓ అమలు సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 50శాతం సీలింగ్ విధానానికి అతీతంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యాకే ఎన్నికలు నిర్వహించాలని, అలా జరగకుంటే తాము రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ జాగృతి సేన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు నిరంజన్, మండల అధ్యక్షుడు నర్సింములు, ఎమ్మార్పీఎస్ నాయకుడు భీంరాజ్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రులకు కొత్త అధిపతులు

- మెడికల్ కళాశాలలకు సైతం నూతన ప్రిన్సిపాళ్లు
- ఉమ్మడి జిల్లాలో సమూల మార్పులు



పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జనరల్ ఆస్పత్రులకు కొత్త అధిపతులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణపేట జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కాకతీయ మెడికల్ కళాశాలలో రేడియో థెరపీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సి.సంజీవ్‌కుమార్‌ను నియమించారు. అదే విధంగా గాంధీ మెడికల్ కళాశాల పిడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ కె.నాగార్జున గద్వాల జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, మహేశ్వరం మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డా.మహబూబ్‌ఖాన్‌ను గద్వాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. వికారాబాద్ మెడికల్ కళాశాల జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ పి.మల్లిఖార్జున్ వనపర్తి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, నిజామాబాద్ మెడికల్ కళాశాల పిడియాట్రిక్ ప్రొఫెసర్ టి.ఉషారాణి నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. సంగారెడ్డి కళాశాల ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్ శోభన్‌బాబును వనపర్తి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.

■ ప్రస్తుతం నారాయణపేట మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న డా.రామకిషన్ తిరిగి ఆయన స్థానానికి వెళ్లనున్నారు. ఆయన ఉస్మానియా ఆస్పత్రిలో అర్థో విభాగం హెచ్‌ఓడీ పోస్టులో ఉండగా.. 2024 జనవరిలో నారాయణపేట మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. దాదాపు ఏడాదిన్నర కాలం పాటు ఆయన అక్కడ పనిచేశారు. అయితే గతంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా రామకిషన్ పనిచేసిన అనుభవం ఉన్న క్రమంలో మళ్లీ తిరిగి ఆయనకు బాధ్యతలు అప్పగించే అవకాశం కూడా కొంత ఉన్నట్లు తెలుస్తోంది.

పాలమూరు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పదోన్నతి

మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డా.సంపత్‌కుమార్ సింగ్ పదోన్నతిపై నారాయణపేట మెడికల్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. అదే విధంగా గైనిక్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డా.సంగీతషా సిద్దిపేట జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డా.దీన్‌దయాళ్ బంగ్ వికారాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లు పూర్తిచేసుకున్న 45మంది ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతులు కల్పిస్తూ.. ఉత్తర్వులు జారీ అయ్యాయి. అందులో భాగంగా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లు స్థానచలనం పొందారు. వారి స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు. ఇదిలా ఉంటే, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సంపత్‌కుమార్ సింగ్ ఏడాదికాలం పనిచేశారు. ఇక్కడే పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరిని సూపరింటెండెంట్‌గా నియమించే అవకాశం ఉంది. అయితే సీనియర్లలో రేడియాలజీ విభాగం ప్రొ. హన్మంత్ ప్రసాద్, పిడియాట్రిక్ విభాగం డాక్టర్ సురేశ్, అర్థో విభాగం హెచ్‌ఓడీ డా.రమేశ్ ముందంజలో ఉన్నారు. ఈ ముగ్గురిలో ఒకరికి అవకాశం ఇస్తారా.. లేకపోతే వారం రోజుల్లో జరిగే అసోసియేట్ ప్రొఫెసర్ల కౌన్సెలింగ్‌లో కొత్తగా ప్రొఫెసర్ అయ్యే వారికి అవకాశం కల్పిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వారిలో కూడా చాలా మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించనుంది.

రూ.8 కోట్ల విలువైన ధాన్యం మాయం

- రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీతో వెలుగు చూసిన ఘటన
- యజమానిపై కేసు నమోదు



కోస్గిలోని రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

కోస్గి: పట్టణంలోని రైస్ మిల్లుల్లో మంగళవారం పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారుల బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. స్థానిక శ్రీలక్ష్మీ నర్సింహ రైస్ మిల్లులో భారీ మొత్తంలో వరి ధాన్యం నిల్వలు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. డీఎస్‌ఓ బాల్‌రాజ్ తెలిపిన మేరకు వివరాలిలా.. రైస్ మిల్లు యజమానులు వరి ధాన్యం నిల్వలకు సంబంధించిన పూర్తి వివరాలు పౌర సరఫరాల శాఖకు అందించాలని పలుమార్లు సూచించినప్పటికీ కొందరు మిల్లర్లు స్పందించకపోవడంతో ఆకస్మిక దాడులు చేశారు. ఈక్రమంలో శ్రీలక్ష్మీ నర్సింహ రైస్ మిల్లులో రూ.8 కోట్ల విలువైన ధాన్యం నిల్వలు తేడా ఉన్నట్లు గుర్తించారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాలను జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించారు. సదరు శ్రీలక్ష్మీ నర్సింహ రైస్ మిల్లుకు సైతం 2022–23 రబీ సీజన్‌లో 56,625 బస్తాల ధాన్యం, 2024–25 ఖరీఫ్ సీజన్‌లో 22,792 బస్తాల ధాన్యం కేటాయించారు. ధాన్యం తీసుకొని నిర్ణీత గడువులోగా మర ఆడించి (సీఎమ్మార్) బియ్యాన్ని అందించాల్సి ఉండగా.. సదరు మిల్లర్ ఎంతకూ అందివ్వకపోవడంతో అధికారులు తనిఖీ చేశారు. అధికారికంగా 75,417 బస్తాల ధాన్యం ఉండాల్సి ఉండగా కేవలం 86 బస్తాల ధాన్యం మాత్రమే మిల్లులో నిల్వ ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 75,331 బస్తాల వరి ధాన్యం మాయమైందని, మొత్తం 3013.24 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ.8 కోట్లు ఉంటుందని, సంబంధిత రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి బాల్‌రాజ్ తెలిపారు. తనిఖీల్లో ఆయనతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆనంద్, భాస్కర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ బాల్‌రాజ్, ఆర్ఐలు, ఇతర రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఎదుట ఆలోచించి మాట్లాడాలి

జడ్చర్ల టౌన్: ప్రజల ఎదుట ఆలోచించి మాట్లాడాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నివాళులు అర్పించి మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రి కోసం రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు లక్ష్మారెడ్డి చెబుతున్నారని.. ఆ భూమి ఎవరి వద్ద కొనుగోలు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. అతడి అల్లుడి పేరున ఆస్పత్రి వద్ద ఉన్న భూమిని ప్రభుత్వానికి అప్పగించాలని.. లేదంటే కోర్టు నుంచి తీసుకుంటామని తెలిపారు. నల్లకుంట భూమిలో మట్టి వేస్తున్నారని సమాచారం రాగా తహసీల్దార్‌ను అడిగితే అది పట్టాభూమి అని తప్పుదోవ పట్టించారన్నారు. కోర్టు ఆదేశాలు రాగానే అక్కడి నిర్మాణాలు కూల్చివేయాలని అధికారులను ఆదేశించానని, తన కుటుంబ సభ్యులుంటే ఎందుకు కూల్చివేయిస్తానని ప్రశ్నించారు. జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన తప్పిదాన్ని అంగీకరించాలని, పాతబజార్‌కు యూటర్న్ ఒక్కటే మార్గమన్నారు. తన నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, అక్రమాల విషయంలో ఫిర్యాదు చేస్తే అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని.. ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలేపల్లి గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై డీపీఓ తాత్సారం చేయడాన్ని అవసరమైతే ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తానన్నారు. అసైన్డ్ భూముల విషయంలోనూ అవినీతి జరిగినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూరెడ్డిపల్లి పరిధిలోని సర్వే నంబర్లు102, 117కు సంబంధించిన భూమి విషయంలోనూ స్వాధీనపర్చుకునే వరకు ఊరుకునేది లేదని.. 8 నెలలుగా అధికారులు జాప్యం చేస్తున్నారని సహించబోమన్నారు. ఇందుకు ప్రజలు సైతం తనకు సహకరించాలని కోరారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

- 14 క్రస్టు గేట్ల ఎత్తివేత..
- 11 యూనిట్ల ద్వారా కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



దిగువ జూరాలలోని పవర్‌హౌజ్

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు లక్షా 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి లక్షా 25వేలకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు 14 క్రస్టు గేట్లను ఎత్తి 94,962 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29,053 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–1కు 1300, ఆవిరి రూపంలో 43, ఎడమ కాల్వకు 770, కుడి కాల్వకు 400, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150.. ప్రాజెక్టు నుంచి మొత్తం 1.26 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.952 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్‌కు వరద జోరు..

అలాగే, ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద జోరు కొనసాగుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 91.08 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1,08,286 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,15,670 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.05 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1,14,972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 30 క్రస్టు గేట్లను ఎత్తి ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు 1,17,245 క్యూసెక్కుల నీటిని దగువకు విడుదల చేస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో మంగళవారం 11 యూనిట్ల ద్వార విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వార 195 మెగావాట్లు, 99.302 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వార 240 మెగావాట్లు, 119.011 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటి వరకు 30 వేల క్యూసెక్కులను వినియోగించి 218.313 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామని తెలిపారు.

'కర్వెన'తో రూ.కోట్లు దండుకున్నావ్

దేవరకద్ర ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు



మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసి అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం దేవరకద్ర క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గ కేంద్రం దేవరకద్రకు చేసిందేమిటని ప్రశ్నించారు. అనాలోచిత నిర్ణయాలతో ప్రణాళిక లేకుండా ఆర్వోబీ నిర్మించి రెండుగా చీల్చారని.. పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో కర్వెన ప్రాజెక్టు కాంట్రాక్టు పనులు, కందూరు, అడ్డాకులలో నల్ల మట్టి తరలింపు చేపట్టి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. మాదాపూర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్, హైవే రోడ్డులో వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. న్యాయవాద వృత్తిని వదిలి ప్రజాసేవ చేయడానికి వచ్చానని.. ఇంకా పదేళ్లు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కమీషన్ల కోసం మామ కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించి అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. కోయిల్‌సాగర్ నుంచి అదనంగా 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పి కనీసం 50 ఎకరాలకు కూడా నీరివ్వలేదని తెలిపారు. గతంలో చేసిన తప్పులు కప్పిపుచ్చుకోడానికి విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కాల్వలకు సాగునీరు ఎప్పుడు అందించాలో తమకు తెలుసని.. ఆ విషయంలో అధికారుల సలహాలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ కతలప్ప, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా



ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: పేదల సంక్షేమమే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని రాష్ట పశుసంవర్ధక, మత్స్య, క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలో చేపడుతున్న 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడతల వారీగా ఇచ్చిన ప్రతి హామీని నేరవేస్తుందన్నారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

రూ.153 కోట్లతో..

నియోజకవర్గ కేంద్రంలో రూ.153 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అధికారులు గ్రామాల్లో నిరంతరం పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రూ.833.50 కోట్లు కేటాయించామని, అందుకు సంబంధించిన పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.15.13 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కట్ట సురేష్, కోళ్ల వెంకటేష్, రవికుమార్, బోయ నర్సింహ, రాజేందర్, అంజనేయులు, గద్వాల్ రవి, నాగరాజు, గోవర్ధన్, నీలప్ప, దండు రాము, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు జర్నలిజం కీలకం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కె.రాజేశ్‌రెడ్డి

కందనూలు: ప్రజాస్వామ్య మనుగడకు జర్నలిజం కీలకమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా నాలుగో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మహోన్నతమైనదని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జర్నలిజం నిర్భయంగా, నిర్మోహమాటంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని.. ఎవరికీ కొమ్ము కాయరాదన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అర్హులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కత్తికంటే కలం గొప్పదన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చాక జర్నలిస్టుల విలువ తెలిసిందన్నారు. తాము చేపట్టే అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నది జర్నలిస్టులు మాత్రమేనని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ.. దేశంలో అగ్రభాగాన తమ సంఘం ఉందన్నారు. 20ఏళ్లకు పైగా సీనియార్టీ ఉన్న వారు ఉన్నారని చెప్పారు. ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించమన్నారు. జర్నలిస్టులను పట్టించుకునే ప్రభుత్వాలకు సహకరిస్తామని.. పట్టించుకోని ప్రభుత్వాలపై పోరాడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్, జిల్లా నూతన అధ్యక్షుడు విజయగౌడ్, కార్యదర్శి సురేశ్ తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం

టుడే లీగ్‌లో 148 పరుగుల తేడాతో రాకేష్ లెవన్‌పై విజయం



జిల్లా జట్టుతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరిగిన హెచ్‌సీఏ బి–డివిజన్ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 68.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి రోజు 6 వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసి మంగళవారం రెండో రోజు ఆట కొనసాగించిన రాకేష్ లెవన్ జట్టు మహబూబ్‌నగర్ బౌలర్ల ధాటికి 41.5 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. మహబూబ్‌నగర్ జట్టులో గగన్ 5, ముఖీతుద్దీన్ 2, జశ్వంత్ 2, కె.శ్రీకాంత్ ఒక వికెట్ దక్కించుకున్నారు.

ఎండీసీఏ అభినందనలు

టుడే లీగ్‌లో మొదటి మ్యాచ్‌లో విజయం సాధించిన జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న మ్యాచుల్లో ప్రతిభ చాటాలని సూచించారు. లీగ్‌లో జిల్లా క్రీడాకారులు తమ వ్యక్తిగత నైపుణ్యాన్ని చాటుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

నిలిచిన మధ్యాహ్న భోజనం



ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న తల్లిదండ్రులు, యువత

గట్టు: మండలంలోని చాగదోణ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో మూడు రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. సోమ, మంగళవారం కొందరు విద్యార్థులు ఇళ్ల నుంచి టిఫిన్ బాక్స్‌ల్లో భోజనం తెచ్చుకోగా.. మరికొందరు సాయంత్రం వరకు పస్తులు ఉండాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామ యువత మహేష్‌గౌడ్, ప్రవీణ్, కార్తీక్, హరిబాబు, విజయ్‌కుమార్, నర్సన్న తదితరులు మంగళవారం పాఠశాలకు చేరుకొని ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. శుక్రవారం 200 విద్యార్థులు పాఠశాలకు హాజరుకాగా.. కేవలం 170 మందికి మాత్రమే నీళ్ల చారుతో భోజనం వడ్డించారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా.. వంట ఏజన్సీ నిర్వాహకుల సమస్య కారణంగా రెండ్రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచినట్లు తెలిపారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. గిట్టుబాటు కావడం లేదని నిర్వాహకులు చెబుతున్నట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించామని, అప్పటి వరకు విద్యార్థులు ఇంటి నుంచి భోజన బాక్సులు తెచ్చుకోవాలని చెప్పినట్లు వివరించారు.

28 నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పీయూలో అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలోని నార్త్‌డామ్ యూనివర్సిటీ వారి గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ ది ఓల్ చైల్డ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల అధ్యాపకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే అవకాశం ఉంటుందని, నార్త్‌డామ్ యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ శాలిని, రూబీనా ఫిలిప్స్, హెచ్‌ఓడీ అంజనేయులు, జంగం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.